సాక్షి
ములుగు
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



ముత్తిరెడ్డికి ఆర్టీసీ, రాజయ్యకు రైతుబంధు - 8లో

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డిని ఆర్టీసీ చైర్మన్‌గా, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యను రైతు బంధు సమితి చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.



హనుమకొండకు హారం

హనుమకొండలో అత్యాధునిక హంగులతో ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మించేందుకు యాజమాన్యం, ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. - 8లో

గరిష్టం/కనిష్టం
33.0^0 / 22.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

రామప్ప కీర్తి విస్తరించేలా..

కొనసాగుతున్న హెరిటేజ్ క్యాంపెయిన్

- రామప్పలో 35 మంది వలంటీర్లకు శిక్షణ
- 12వ తేదీన ముగింపు



వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన (యునెస్కో) రామప్ప ఆలయ కీర్తిని ప్రపంచ నలుమూలల చాటేందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కృషి చేస్తోంది. అందులో భాగంగా యునెస్కో వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ శిక్షణ కార్యక్రమాన్ని 2008లో ప్రారంభించగా గతేడాది నుంచి రామప్పలో నిర్వహిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో 42 మంది వలంటీర్లకు రామప్పలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది 35మందికి రామప్పలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 260 మంది విద్యార్థులు వలంటీర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోగా అర్హతను బట్టి ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజనీరింగ్, పురావస్తు, హిస్టరీ, టూరిజం విభాగాల్లో నైపుణ్యం ఉన్న 40 మంది విద్యార్థులను 14 రాష్ట్రాల నుంచి వలంటీర్లుగా ఎంపిక చేశారు. రామప్పలో 12 రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమానికి 40మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 35 మంది వలంటీర్లు మాత్రమే హాజరయ్యారు. ఐకోమాస్, భారత పురావస్తుశాఖ, రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో రామప్పలో సోమవారం క్యాంపెయిన్ ప్రారంభించగా కొనసాగుతోంది.

వలంటీర్ల శిక్షణ కార్యక్రమాలు ఇలా..

రామప్పలో సోమవారం (2వ తేదీన) ఎస్పీ గాష్ ఆలం శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 6:30 నుంచి 7:30గంటల వరకు రామప్ప గార్డెన్‌లో యోగ గురువు రాంబాబు ఆధ్వర్యంలో వలంటీర్లకు యోగ కార్యక్రమం ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు సందర్శన కార్యక్రమం చేపట్టారు. బుధవారం 4:30 నుంచి 6గంటల వరకు ప్రముఖ పేరిణి నృత్య కళాకారుడు రంజిత్ బృందం ఆధ్వర్యంలో రామప్పలో పేరిణి నృత్యం నిర్వహించారు. నేడు శుక్రవారం సాయంత్రం 4:30 గంటల నుంచి శివాలయం వద్ద శ్రమదానం నిర్వహించి పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమం ఉంటుంది. రేపు మధ్యాహ్నం 2నుంచి 6గంటల వరకు వేయిస్తంభాల గుడి, వరంగల్ ఫోర్టు సందర్శన, 8న మధ్యాహ్నం 2గంటలకు పాండవుల గుట్ట, గణపురం కోటగుళ్లు సందర్శన, సాయంత్రం 4:30గంటలకు రామప్పలో కొమ్ము డ్యాన్స్ ఉంటుంది. 9న వలంటీర్లు సందర్శించిన చారిత్రాక ప్రదేశాలపై ప్రజంటేషన్ ప్రోగ్రాం, 10న మధ్యాహ్నం 2గంటల నుంచి లక్నవరం, మేడారం సందర్శన, 11న లక్నవరం, మేడారంపై ఫీల్డ్ విజిట్‌పై ప్రజెంటేషన్ ప్రోగ్రాం, 12న రామప్పలోని మాన్యుమెంట్ సైట్స్‌లో మొక్కలు నాటే కార్యక్రమం, 13న ముగింపు కార్యక్రమం ఉంటుంది.



క్యాంపెయిన్‌కు హాజరైన వలంటీర్లు

వలంటీర్లకు శిక్షణ.. త్రికుటాలయం వద్ద శ్రమదానం



వలంటీర్లకు శిక్షణ ఇస్తున్న రితీష్‌కుమార్

మండల పరిధిలోని రామప్పలో గల హరితహోటల్‌లో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో వలంటీర్లకు నిర్వహిస్తున్న క్యాంపెయిన్ గురువారం నాలుగవ రోజు ఉదయం యోగ గురువు రాంబాబు వలంటీర్లకు గంటపాటు శిక్షణ ఇచ్చారు. ప్రొఫెసర్ మధు వోట్టెరీ, నిట్ ప్రొఫెసర్ రితీష్‌కుమార్, డాక్టర్ సింధూజలు ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సాయంత్రం 3గంటలకు సరస్సు కట్టపై ఉన్న త్రికుటాలయం వద్ద వలంటీర్లు శ్రమదానం చేసి ఆలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో క్యాంపెయిన్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, కేయూ స్కాలర్స్ కొక్కుల ప్రశాంత్, గైడ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా ప్రచారం..



రామప్ప ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రతిఏటా నిర్వహిస్తున్నాం. చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను వలంటీర్లకు ప్రాక్టికల్‌గా చూపెడుతూ వాటి గొప్పతనాన్ని, చరిత్రను వివరించడం ద్వారా శిక్షణ ముగిసిన తర్వాత రామప్ప ఆలయ చరిత్రను విద్యార్థులు(వలంటీర్లు) వారి రాష్ట్రాలతో పాటు వారు చదువుకుంటున్న యూనివర్సిటీల్లో రామప్ప గొప్పతనంపై ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు చారిత్రక ప్రదేశాలపై నాలెడ్జ్ పెరగడమే కాకుండా విద్యార్థుల మధ్య స్నేహభావం పెరుగుతుంది.

- జె.శ్రీధర్‌రావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు, డబ్ల్యుహెచ్‌వీ కోఆర్డినేటర్

టూరిస్టుల సంఖ్య పెరిగే అవకాశం



రామప్పలో శిక్షణ పొందిన విద్యార్థుల ద్వారా రామప్ప ఆలయ గొప్పతనం, చరిత్ర గురించి దేశ నలుమూలల ప్రచారం జరుగుతుంది. దీంతో రామప్పకు టూరిస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. రామప్పలో మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వం కల్పించడంతో పాటు స్థానికులకు సైతం ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గతేడాది నుంచి రామప్పలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు నిర్వహిస్తోంది.

- కుసుమ సూర్యకిరణ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్

ఆర్టికల్ తయారు చేస్తా..



రామప్ప ఆలయంపై ఆర్టికల్ తయారు చేసి యూనివర్సిటీ విద్యార్థులందరికీ రామప్ప గొప్పతనాన్ని వివరిస్తా. ఇంటాక్ సైట్ ద్వారా సమాచారం తెలుసుకొని వలంటీర్‌గా వచ్చేందుకు దరఖాస్తు చేశా. వలంటీర్ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. రామప్పకు రావడం ఇదే తొలిసారి.

- ఆస్త్రా, ఆర్కిటెక్ విద్యార్థిని, గుజరాత్

న్యూస్‌రీల్

ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం



వాజేడు: పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం కొనసాగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఇంటి స్థలాల కోసం పేదలు పోరాటం చేస్తున్న ప్రదేశాన్ని 26 రోజున గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. పేదలకు ఇంటి స్థలాలను ఇప్పించిన ఘనత సీపీఎంకు ఉందన్నారు. వందలాది మంది పేద ప్రజలు గుడిసెల వద్ద నివాసాలు ఉంటుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇళ్ల స్థలాలు సాధించే వరకు పేదలు ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీస్, రెవెన్యూ అధికార పార్టీ నాయకులు వచ్చినా భూమిని వదల వద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, సూడి కృష్ణారెడ్డి, సాంబశివ, వాసు, దావూద్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

గౌడసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అశోక్‌గౌడ్

ములుగు: తెలంగాణ గౌడసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూనూరి అశోక్‌గౌడ్‌ను నియమిస్తూ ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరిగౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో గౌడకులస్తుల అభివృద్ధికి కృషి చేస్తున్న అశోక్‌గౌడ్‌ను గుర్తించి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గౌడకులస్తుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చింత రమేష్, రాష్ట్ర నాయకులు మోహన్‌గౌడ్, ముశ్నిపెల్లి కుమార్, భీమగాని ఆనంద్, దూలం సదానంద, బుర్ర శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి మౌన పోరాటం



మంగపేట: మండల పరిధిలోని కోమటిపల్లికి చెందిన కారుపోతుల రవివర్మ తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని యువకుడి ఇంటి ఎదుట అదే గ్రామానికి చెందిన కుడుముల నాగసమీర గురువారం మౌన పోరాటానికి దిగింది. రవివర్మ తనను నాలుగేళ్లుగా వాడుకుని పెళ్లి చేసుకోమని అడిగితే దాటవేస్తున్నాడని వాపోయింది. ఈ క్రమంలో రవివర్మ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో యువతి ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగింది. పెళ్లి చేసుకునే వరకు తాను ఇక్కడి నుంచి కదలనని చెబుతోంది. యువతికి అండగా కుటుంబ సభ్యులు, బంధువులు, మహిళలు అండగా నిలిచారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మంగపేట: మండల పరిధిలోని రాజుపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా, జోనల్ స్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల హెచ్‌ఎం రావుల భాస్కర్‌రావు వారిని గురువారం అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని తిమ్మంపేటలో ఈ నెల 3న నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 16 మంది జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 4న ఏటూరునాగారంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 16మంది పాల్గొన్నారని తెలిపారు. ఇందులో పదో తరగతి చదువుతున్న దివ్య జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయిందని వివరించారు. విద్యార్థులు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని హెచ్‌ఎం విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ దాసరి రవి, ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్, వీర నారాయణ, రమాదేవి, జమున, పావని, లావణ్య, మహాదేవి, పటాన్, ఆస్మాబీ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలకు కానిస్టేబుల్ ఉద్యోగం



కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన భార్యాభర్తలు

ములుగు రూరల్: టీఎస్‌పీఎస్ నిర్వహించిన కానిస్టేబుల్ ఫలితాలు గురువారం విడుదల కాగా ములుగు మండలం సర్వాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు గువ్వల ప్రశాంత్ రెడ్డి–మనోజారెడ్డి ఉద్యోగం సాధించారు. ప్రశాంత్ రెడ్డి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ ఉద్యోగం సాధించాడు. ప్రశాంత్‌రెడ్డి భార్య మనోజా ఇంటి దగ్గర ఉంటూ చదువుకుంటూ ఉద్యోగం సాధించి ఇరువురు అందరికి ఆదర్శంగా నిలిచారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు నామినేషన్ వేయనున్న ఏఐటీయూసీ

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా నేడు(శుక్రవారం) ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నామినేషన్లు వేయనున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 7వ తేదీవరకు నామినేషన్ వేయని సంఘాలు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం లేదన్నారు. ఎన్నికల ప్రక్రియపై కొన్ని కార్మిక సంఘాలు చేసే దుష్ప్రచారాలను కార్మికులు నమ్మవద్దన్నారు. సింగరేణి ఎన్నికలను వాయిదా వేయాలని మరోసారి యాజమాన్యం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది హైకోర్టులో మరోసారి కేసు వేయనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



విద్యార్థినులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న పీఓ

ఐటీడీఏ పీఓ అంకిత్

వాజేడు: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 2023–24 సంవత్సరానికి 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాల స్థాపనకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాగా పీఓ తాత్కాలికంగా ప్రారంభించి గదులను పరిశీలించారు. కిచెన్ షెడ్, వంట గదిలోని పాత్రలు, ప్లేట్లు, గ్లాసులు మొదలైన వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కార్యకలాపాలు, ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వేక్షించాలన్నారు. పాఠశాల ఆవరణ, వంటగది, పారిశుద్ధ్య ఏర్పాట్లపై వంట మనుషులకు, కార్మికులకు దిశానిర్దేశం చేశారు. అధ్యాపకులు బోధించే సబ్జెక్టుల వివరాలను ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకుని నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కొత్తగా చేరిన 5, 6 తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వారి స్వస్థలాలు, ఇంతకు ముందు ఎక్కడ చదివింది అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బెడ్ షీట్లు, పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారిణి ఏపీ రాజ్యలక్ష్మి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణ్‌రావు మృతితో విషాదఛాయలు

- అనారోగ్యంతో సమ్మక్క పూజారి మృత్యువాత
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మణ్‌రావు (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: సమ్మక్క పూజారి సిద్ధబోయిన లక్ష్మణ్‌రావు (45) అనారోగ్యంతో గురువారం ఉదయం కన్నుమూశారు. దీంతో ఆయన స్వగ్రామం మేడారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఐదుగురు సమ్మక్క ప్రధాన పూజారుల్లో లక్ష్మణ్‌రావు ఒకరు. తండ్రి పుల్లయ్య మరణించిన తదనంతరం లక్ష్మణ్‌రావు సమ్మక్క పూజారిగా బాధ్యతలు స్వీకరించారు. పది జాతరల నుంచి ఆయన సమ్మక్క పూజారులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. జాతరలో మండమెలిగె పండుగ నుంచి మొదలుకుని.. వనదేవతలను చిలకలగుట్ట నుంచి గద్దె పైకి తీసుకువచ్చే వరకు లక్ష్మణ్‌రావు పూజా కార్యక్రమాల్లో ముందుండేవారు. జాతరలో అమ్మవార్ల పూజా కార్యక్రమాల్లో ముందుండే లక్ష్మణ్‌రావు మృతితో గ్రామంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి. లక్ష్మణ్‌రావు మృతికి సమ్మక్క–సారలమ్మ పూజారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యవతి రాథోడ్ లక్ష్మణ్‌రావు మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఎమ్మెల్యే సీతక్క మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాప సానుభూతిని ప్రకటించారు. ఈఓ రాజేంద్రం లక్ష్మణ్‌రావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. తాడ్వాయి ఎస్సై ఓంకార్ యాదవ్ లక్ష్మణ్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు పూజారుల తరఫున సంతాపం వ్యక్తం చేస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

రెండు ఇళ్లలో చోరీ



బీరువా పగులగొట్టి వస్తువులను పడేసిన దొంగలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జక్కుల వారి వీధి, జగదాంబ సెంటర్‌లోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. జక్కుల వారి వీధికి చెందిన మడుగూరి సుధాకర్ ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి బీరువాలోని మూడు తులాల బంగారు నగలు, ఏడు తులాల వెండి వస్తువులతో పాటు రూ.20వేల నగదుకు ఎత్తుకెళ్లారు. అదే విధంగా జగదంబా సెంటర్‌లో ఉన్న చిట్టెం వాసు ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా పక్క పోర్షన్‌కు ఉన్న కిటికి ఊచలను తొలగించి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారు నగలు, రూ.12వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ విషయంపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అశోక్ సంఘటనా స్థలాలను క్లూస్ టీమ్‌లతో వెళ్లి పరిశీలించి వివరాలను సేకరించారు.

వంట కార్మికులకు పెంచిన వేతనాలు అందించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ములుగు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అందించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వంట కార్మికులు చేపట్టిన సమ్మె 16వ రోజుకు చేరుకోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపి విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వంట కార్మికులకు కనీస వేతనం 10 వేలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి నర్సయ్య, ముత్యాల రాజు, పైడి బాబు, కొమురయ్య, కార్మికులు ప్రమీల, శోభ, పర్వీన, ఉమాదేవి, పోచమ్మ, లక్ష్మీ, రాధ, కమలక్క, నీలమ్మ, పద్మ, భాగ్య, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ పర్యటన

- ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వరంగల్‌లోనే..
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- 'కుడా' గ్రౌండ్స్, ఖిలా వరంగల్‌లో బహిరంగసభ
- కేటీఆర్ పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు



సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం వరంగల్ మహానగరంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటల వరకు గ్రేటర్ వరంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపనలు చేయనున్నారు. సుమారు ఎనిమిది గంటల పాటు నగరంలో కేటీఆర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ పర్యటన ఖరారైన నేపథ్యంలో మూడు రోజులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా.. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్ రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇదిలా ఉండగా హనుమకొండ 'కుడా' మైదానం, ఖిలా వరంగల్‌లో వేర్వేరు బహిరంగసభల్లో కేటీఆర్ ప్రసంగిస్తారు. కాగా, కేటీఆర్ పర్యటన సక్సెస్ కోసం గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఏటూరునాగారం: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ గురువారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో మరో ఉపాధ్యాయుడు వస్తేనే రిలీవ్ చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అవసరమైతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. అదే విధంగా గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని కోరారు. అప్‌గ్రేడ్ అయిన పండిట్, పీఈటీ పోస్టుల విషయంలో ఏర్పడిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్, శంకర్, అశోక్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు

ములుగు రూరల్: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం 11వ రోజు సమ్మెలో భాగంగా డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ కోసం నిరంతరం పని చేస్తున్న ఆశ కార్యకర్తల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆశ వర్కర్లకు కనీసవేతనం అమలు చేస్తూ పీఆర్సీ ప్రకటించాలన్నారు. హెల్త్ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశ వర్కర్లకు ఏఎన్ఎం పోస్టుల్లో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని హామీనిచ్చి ఐదేళ్లు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం నీలాదేవి, రమాదేవి, కవిత, సుధారాణి, రజిత, మమత, శ్రావణి, సమ్మక్క, ఈశ్వరి, సరిత, అరుణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీవోఎస్‌గా శంకరయ్య బాధ్యతల స్వీకరణ



మంథిని శంకరయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ఆచార్యుడు మంథిని శంకర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం బీవోఎస్‌గా ఉన్న ప్రొఫెసర్ బన్న ఐలయ్య నుంచి శంకరయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐలయ్య తెలుగు విభాగం అధిపతిగా, ఆర్ట్స్‌డీన్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతిగా వీరస్వామి



విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతిగా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె వీరస్వామిని నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో ఒక్కరు కూడా రెగ్యులర్ అధ్యాపకులు లేరు. దీంతో దూరవిద్య కేంద్రం జాయింట్ డైరెక్టర్, సైకాలజీ విభాగం అధిపతి, సీడీసీడీన్‌గా ఉన్న ఆచార్య రాంచంద్రం పొలిటికల్‌సైన్స్ విభాగ అధిపతిగా కొనసాగిస్తూ వస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామిని విభాగం అధిపతిగా నియమించారు.

ఏఆర్‌ల అంతర్గత బదిలీ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ల (ఏఆర్)ను అంతర్గతంగా బదిలీలు చేశారు.ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టిశ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎం నర్సింహారావును పరీక్షల విభాగంలో ఎస్‌డీఎల్‌సీఈ విభాగానికి, ఎస్‌డీఎల్‌సీఈలో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సరళా దేవిని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలకు బదిలీ చేశారు.

మరో ముగ్గురు ఏఆర్‌లకు అదనపు బాధ్యతలు

కేయూలోని పరిపాలనాభవనంలో టీచింగ్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న పెండ్లి అశోక్‌బాబుకు అడ్మినిస్ట్రేషన్ నాన్ టీచింగ్ విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు. పరీక్షల విభాగం అండ్ సీడీసీ డీన్ కేయూ ఏఆర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్ వెంకటేశ్వర్లుకు అదనంగా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీకి ఏఆర్ బాధ్యతలు అప్పగించారు. కేయూ అకడమిక్ బ్రాంచ్‌లో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోలాశంకర్‌కు యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీకి ఏఆర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

హనుమకొండకు హారం..

అత్యాధునిక హంగులతో నూతన బస్ స్టేషన్
- రూ.83 కోట్లతో నిర్మాణం
- 35 ప్లాట్స్ ఫామ్స్,సెల్లార్‌లో పార్కింగ్
- గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్ స్టేషన్
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్



ప్రతిపాదిత నూతన బస్ స్టేషన్ గ్రౌండ్ ఫ్లోర్ నమూనా

హన్మకొండ: హనుమకొండలో అత్యాధునిక హంగులతో బస్ స్టేషన్ నిర్మించేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.83 కోట్లతో చేపట్టడానికి ప్రణాళిక రూపొందించారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండో అంతస్తులతో ఈ బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. శుక్రవారం రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. భవిష్యత్‌లో ట్రాఫిక్, వాహనాల సంఖ్య పెరిగినా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా నిర్మించనున్నారు.

బహుముఖ వ్యూహంతో బస్‌స్టేషన్ నిర్మాణం..

ప్రస్తుతం హనుమకొండ బస్ స్టేషన్‌ను బహుముఖ వ్యూహంతో నిర్మించనున్నారు. బస్ స్టేషన్ నిర్మించే క్రమంలో ప్రయాణికుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా సెల్లార్ నిర్మించనున్నారు. 170 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా సెల్లార్ చేపట్టనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికులను బస్సులోకి ఎక్కించుకునేందుకు 35 ప్లాట్ ఫామ్స్ నిర్మిస్తారు. ఇదే ఫ్లోర్‌లో ప్రయాణికుల విశ్రాంతి గది నిర్మించనున్నారు. దీంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్, క్యాంటీన్, కార్గో–పార్సిల్ సర్వీస్ కార్యాలయం నిర్మించనున్నారు.

రోజు 2లక్షల మంది ప్రయాణికుల చేరవేత..

హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి రోజు మామూలు సమయంలో గంటకు 200, పీక్ టైమ్‌లో 350 బస్సులు వచ్చి వెళ్తుంటాయి. రోజుకు 1100 బస్సులు ఈ బస్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు 2 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని 70,900 చదరపు అడుగుల్లో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించనున్నారు. మొదటి అంతస్తులో ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. 49,500 చదరపు అడుగుల్లో మొదటి అంతస్తు నిర్మించనున్నారు. రెండో అంతస్తును 27 వేల చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. ఈ ఫ్లోర్‌లో ఆడిటోరియంతో పాటు వాణిజ్య సముదాయం ఉంటుంది.

1974లో హనుమకొండ బస్ స్టేషన్ ప్రారంభం

హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ ఆవరణలో వరంగల్ రీజియన్ కార్యాలయంతో పాటు నిర్మించిన బస్ స్టేషన్‌ను 1974 మార్చిలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. ఇదే ఆవరణలో 12 ప్లాట్ ఫామ్స్‌తో నిర్మించిన బస్ స్టేషన్ 1990 నవంబర్‌లో అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మాదాడి నర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం దీనిని సిటీ బస్ స్టేషన్‌గా మార్చారు.

'కుడా' మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్

నూతన బస్ స్టేషన్ నిర్మించనున్న క్రమంలో హనుమకొండ బాలసముద్రంలోని 'కుడా' (హయగ్రీవ చారి) మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు ఆటంకం కలుగకుండా ఏర్పాటు చేయనున్నారు. మేడారం జాతరకు బస్సులను ఇదే మైదానం నుంచి నడుపుతారు. ఈ క్రమంలో జాతర వరకు తాత్కాలిక బస్ స్టేషన్ నిర్మాణం జరిగే అవకాశం లేదు. జాతర తర్వాతే హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నిర్మాణ పనులు మొదలుకానున్నాయి.

శంకుస్థాపనకు ఏర్పాట్లు



హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నిర్మాణ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశాం. రూ.83 కోట్లతో అత్యాధునిక హంగులతో ఈ బస్ స్టేషన్‌ను నిర్మించనున్నాం. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా 'కుడా' మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం.

-జె.శ్రీలత , ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్

ముత్తిరెడ్డికి 'ఆర్టీసీ' రాజయ్యకు 'రైతుబంధు'

జనగామ జిల్లాకు రెండు కార్పొరేషన్ పదవులు
- ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్, తక్షణం అమలులోకి..
- సిట్టింగ్ టిక్కెట్ల సమస్యకు పరిష్కారం!

జనగామ/ స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లాకు రెండు స్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం రాత్రి సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల కాలపరిమితితో కూడిన చైర్మ న్ పదవిని కట్టబెడుతూ, తక్షణం అమలులోకి వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టిక్కెట్ రాకపోవడంతో వారిని బుజ్జగించే ప్రయత్నంలో అధిష్టానం రాష్ట్రస్థాయి పదవులను కట్టబెట్టింది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇటీవల కేసీఆర్ రాష్ట్రంలోని 115 అసెంబ్లీ సీట్లను ప్రకటించగా, జనగామ టికెట్‌ను పెండింగ్‌లో ఉంచారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అనధికారికంగా టికెట్ కన్ఫాం చేయగా, ముత్తిరెడ్డి సైతం బరిలో తానేనంటూ పట్టుబట్టి కూర్చున్నాడు. దీంతో కొన్ని రోజులుగా జనగామ బీఆర్‌ఎస్‌లో రాజకీయ పరిణామాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సయోధ్య కుదిర్చేందుకు పార్టీ పెద్దలు ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారం రోజులుగా ముత్తిరెడ్డి ఆరోపణలు గుప్పిస్తుండడంతో వచ్చే ఎన్నికల్లో నష్టం జరిగే ప్రమాదం ఉండడంతో సీఎం కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని బుజ్జగించే ప్రయత్నంలో తెలంగాణ ఆర్టీసీ చైర్మన్‌గా నియమించారు.

రైతుబంధు సమితి చైర్మన్‌గా డాక్టర్ రాజయ్య

అంతా అనుకున్నట్లే.. ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను తెలంగాణ రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్‌గా నియమించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ నుంచి మొదట 2009లో స్టేషన్ ఘన్‌పూర్ నుంచి రాజయ్య ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం వచ్చిన తెలంగాణ ఉద్యమంతో 2011లో టీఆర్‌ఎస్‌లో చేరారు. అధికార కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో అప్పటి టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పార్టీ తరపున 2012 ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 2014లో, 2018లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలుపొందారు. కొన్ని కారణాలతో ఈసారి రాజయ్యకు టిక్కెట్ ఇచ్చేందుకు సీఎం నిరాకరించారు. కడియం శ్రీహరికి ఘన్‌పూర్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చినప్పటి నుంచి రాజయ్య అసంతృప్తితో ఉన్నారు. పలుమార్లు బహిరంగంగా విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఒకవైపు సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తామని అంటూనే పరోక్షంగా శ్రీహరిపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల కేటీఆర్ రాష్ట్ర రైతుబంధుసమితి చైర్మన్ పదవి ఇస్తానని చెప్పినా తిరస్కరించినట్లు, ఎంపీగా లేదా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారని చెప్పినట్లు స్వయంగా రాజయ్య పత్రికా సమావేశంలో తెలిపారు. చివరగా రాజయ్యకు రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పదవి ఇవ్వడంతో నియోజకవర్గంలో కడియం, రాజయ్య మధ్య సయోధ్య కుదరనుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

కేసీఆర్‌పై నమ్మకం ఉంది



ఆర్టీసీ చైర్మన్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. జనగామ టికెట్ విషయంలో కేసీఆర్‌పై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చినట్లు ఎంపీ సంతోష్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. నేడు వరంగల్‌లో జరిగే కార్యక్రమానికి మంత్రి కేటీఆర్‌తో కలిసి వస్తున్నా.

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్యే జనగామ

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా



నేను వారణాసిలో ఉన్నా. రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్ పదవి ఇచ్చినట్లు తెలిసింది. ఏది ఏమైనా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం.

- తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే, ఘన్‌పూర్

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

- అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ తమిళనాడు
- బెస్ట్ అథ్లెట్‌గా ఏపీకి చెందిన నాగులు



అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న తమిళనాడు

హన్మకొండ: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గురువారం ముగిశాయి. నాలుగు రోజుల నుంచి హోరాహోరీగా సాగుతున్న పోరులో ఆరు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తలపడగా తమిళనాడు క్రీడా బృందం పతకాల వేటలో దూసుకెళ్లింది.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ తమిళనాడు

అథ్లెటిక్స్ 19 ఈవెంట్లలో జరిగిన పోటీల్లో తమిళనాడు క్రీడాకారులు ముందు వరుసలో నిలిచారు. 75 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. 53 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం, 17పాయింట్లతో ఉత్తర్‌ప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. బెస్ట్ అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కేవీ నాగులు ట్రోఫీ దక్కించుకున్నాడు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత..

బాల్‌బ్యాడ్మింటన్ పోరులో తమిళనాడు విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఆంధ్రప్రదేశ్, తృతీయ స్థానంలో కర్ణాటక జట్లు నిలిచాయి. బెస్ట్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా తమిళనాడుకు చెందిన మదన్ ట్రోఫీ దక్కించుకున్నాడు.

బహుమతుల ప్రదానం

ముగింపు వేడుకలకు టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడలతో స్నేహ పూర్వక సంబంధాలు బలపడుతాయన్నారు. టీఎస్ ట్రాన్స్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్ వడివేలు, టీఎస్ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కేవీ జాన్సన్, టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు పి రాజారెడ్డి, విజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, టీఎస్ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి రోజు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

మెడికల్ ఆఫీసర్ నియామకానికి ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఆరోగ్య కేంద్రంలో ఫుల్‌టైం మెడికల్ ఆఫీసర్ నియామకానికి ఈనెల 7న సాయంత్రం 4గంటలకు క్యాంపస్‌లోని పరిపాలనాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ఉద్యోగులు అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులకు సేవలందించాల్సింటుందన్నారు. ఎంబీబీఎస్ అర్హత కలిగి ఉండి ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ముస్తాబైన క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్



క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్

మడికొండ: కాజీపేట మండలం మడికొండ ఐటీ కారిడార్‌లోని క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. శుక్రవారం ఐటీ శాఖ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఈ కంపెనీలో సుమారు 500 మందికి ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

- వరంగల్ సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు నేడు నగరానికి విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి రంగనాథ్ తెలిపారు. ఈ ఆంక్షలు శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.

భారీ వాహనాలు ఇలా..

ములుగు, భూపాలపల్లి వైపు నుంచి హైదరాబాద్ చేరుకోవాల్సిన భారీ వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మం చేరుకోవాల్సిన వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు నుంచి వెళ్లాలి.

- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పిరీలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి.
- భారీ వాహనాలు సిటీ బయటే నిలిపివేయాలి.

మంత్రి పర్యటన ముగిసే వరకూ భారీ వాహనాలకు సిటీలోకి అనుమతి లేదు.

నగరంలో రాకపోకలు సాగించే వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు..

- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ, అంబేడ్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవిమాల్ మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి ములుగు, కరీంనగర్ వైపునకు వెళ్లే బస్సులు వయా ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీఓ ద్వారా కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపునకు వెళ్లాల్సిన బస్సులు వయా బాలసముద్రం, ఆదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట మీదుగా నాయిడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, ఆదాలత్, బాలసముద్రం రోడ్డు మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

మోటార్లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్టు

- రూ.1.44 లక్షల విలువైన 13 యంత్రాలు స్వాధీనం



చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ పొలాల్లో వ్యవసాయ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. ఈమేరకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో చోరీల వివరాలను విలేకరులకు వెల్లడించారు. పీఎస్ పరిధిలో వ్యవసాయ మోటార్లు అపహరణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో సీఐ మహేందర్ ఎస్సై శ్రీకాంత్, ఏఎస్ఐ ఉప్పలయ్య నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు దర్యాప్తు చేస్తున్న క్రమంలో చోరీ చేసిన మోటార్లను అమ్ముతున్న హైదర్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో వివరాలు తెలిశాయన్నారు. ఇటుక బట్టీల్లో కూలీ చేస్తున్న హైదర్‌కు 11మంది సంతానం. వీరిని పోషించేందుకు కూలీ డబ్బు సరిపోకపోవడంతో చోరీలను ఎంచుకున్నారన్నారు. బట్టీల ప్రాంతంలోని వ్యవసాయ పొలాల వద్ద వ్యవసాయ మోటార్లను చోరీ చేసి పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసే గంధం పోశాలకు విక్రయిస్తున్నాడు. దీంతో ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువతి మృతి



శిరీష(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ట్రాక్టర్ పైనుంచి పడి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శనిగపురం గ్రామ శివారు కుమ్మరి కుంట్ల తండాకు చెందిన మాలోత్ మహేష్, శిరీష (28) దంపతులు తమ ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కోసం జిల్లా కేంద్రానికి వచ్చారు. పని పూర్తయ్యాక ఇంటికి వెళ్తున్న క్రమంలో మహేష్ ట్రాక్టర్ నడుపుతుండగా, శిరీష ఇంజన్ భాగంలో ఎడమ వైపున కూర్చుంది. ట్రాక్టర్ శనిగపురం శివారు శ్రీరామ ఆలయం సమీపంలోకి చేరుకోగానే శిరీష కళ్లు తిరిగి ట్రాక్టర్ పైనుంచి కింద పడింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందింది. ఈఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై రాంచరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



కొంరయ్య (ఫైల్)

దుగ్గొండి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తొగర్రాయిలో జరిగింది. గ్రామానికి చెందిన నరిగె ఎర్ర కొంరయ్య(55) బుధవారం ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో వెళ్లారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు.ఈ క్రమంలో లక్ష్మీపురం -కేశవాపురం గ్రామాల మధ్య చైన్ పడి వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో కొంరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు నరిగె భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్..



సంధ్యారాణి(ఫైల్)

టేకుమట్ల(గోరికొత్తపల్లి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ అంగన్‌వాడీ టీచర్.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొత్తపల్లి గోరి మండలం జగ్గయ్యపేటలో జరిగింది. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గంప సంధ్యారాణి(45) కొంతకాలంగా కడుపు నొప్పితో తీవ్ర ఇబ్బంది పడుతోంది. బుధవారం కూడా నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లోని గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

దుష్టపాలనకు చరమగీతం పాడాలి



రామరాజుపల్లిలో మాట్లాడుతున్న సీతక్క



నీర్మాలలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

- ఏఐసీసీ కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క

దేవరుప్పుల: కేసీఆర్ పాలన నాటి నైజాం సర్కార్‌ను తలపిస్తోంది.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ దుష్టపాలనకు చరమగీతం పాడడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. దేవరుప్పుల మండలం రామరాజుపల్లిలో తలపెట్టిన కాంగ్రెస్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం సింగరాజుపల్లిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామరాజుపల్లిలో 'కాంగ్రెస్ గ్యారంటీ ఆరు పథకాల'పై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమరుల ఆశయాలను పక్కనపెట్టిన కేసీఆర్ తన కొడుకు కేటీఆర్‌కు పట్టాభిషేకం చేసేందుకు తహతహలాడిపోతున్నారన్నారు. అవినీతి పాలనతో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, పేదలకు ఉచిత విద్య, వైద్యాన్ని విస్మరించారని ధ్వజమెత్తారు. మంత్రి దయాకర్‌రావు తన పదవి కాపాడుకోవడం తప్ప ప్రజల మౌలిక వసతులపై శ్రద్ధ పెట్టడంలేదని విమర్శించారు. ఉద్యమాలకు నిలయమైన పాలకుర్తిలో ప్రజాస్వామికవాదులు, ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టి పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న మంత్రి ఎర్రబెల్లి.. ములుగు నియోజకవర్గానికి వచ్చి నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆయన కోవర్టు రాజకీయాలు ఇక చెల్లవన్నారు. స్థానికురాలు, సమాజ సేవకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, పెద్ది కృష్ణమూర్తి, నల్ల శ్రీరామ్, గండిపెల్లి యాకయ్య, వంగాల మల్లారెడ్డి, ఇనుముల నాగరాజు, సజ్జన్, కాడబోయిన నాగరాజు, బోనగిరి యాకస్వామి, పురుషోత్తం కృష్ణ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలతో బీఆర్‌ఎస్ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాలకు హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 40 ఏళ్లుగా పాలకుర్తి, చెన్నూరు నియోజవర్గాల్లో ఒకే సామాజిక వర్గం రాజ్యమేలుతోందన్నారు. నియోకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాలలు లేకపోవడం మంత్రి రాచరిక పాలనకు నిదర్శనమన్నారు. అంతకు ముందు సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నీర్మాలలో స్వల్ప ఘర్షణ..

దేవరుప్పుల : మండలం నీర్మాల గ్రామంలో కాంగ్రెస్ తలపెట్టిన సంకల్పయాత్ర సభలో గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ప్రసంగిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకునే యత్నం చేయడంతో స్వల్ప ఘర్షణకు దారి తీసింది. సభ కొనసాగే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ బంద్‌చేయడంతో జనరేటర్‌తో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి దయాకర్‌రావుపై విమర్శలు చేస్తుండగా బీఆర్‌ఎస్ మండల నాయకుడు ఇంటి మల్లారెడ్డి ప్రతి విమర్శకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం కొనసాగిన సభలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ సభను అడ్డుకునే దుశ్చర్యలు తగవని, ప్రతిపక్షాలను ప్రజల్లో తిరగనివ్వకుండా నిలువరించే చర్యలను ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. కాగా, ఘర్షణలో మల్లారెడ్డి, చిరంజీవికి గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.